# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871



వీలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :40 | 24-08- 2026 | సోమవారం | పేజీలు: 4 | వెల:03/-


## కేంద్రం వైఖరిపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

# ‘హైదరాబాద్‌కు వచ్చాక అన్నీ మాట్లాడతా’



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరుగు ప్రయాణమైన సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఆయన కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. రాష్ట్ర అభివృద్ధి మరియు సంక్షేమం కోసం చేపట్టిన విదేశీ పర్యటనలకు అనుమతులు మంజూరు చేసే విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కావాలనే వివక్ష చూపుతోందని ఆయన సంచలన ఆరోపణాలు చేశారు.

తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు తీసుకురావాలనే లక్ష్యంతో యూకే మరియు యూఎస్ పర్యటనల కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే అన్ని రకాల అనుమతుల కోసం కేంద్ర విదేశాంగ శాఖకు దరఖాస్తు చేసుకుందని సీఎం వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వం కేవలం లండన్ పర్యటనకు మాత్రమే అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి నిరాకరించిందని వెల్లడించారు. ఎటువంటి బలమైన రీజన్ లేకుండా, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అమెరికా పర్యటనను అడ్డుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ఈ విషయంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారని, ఫెడరల్ వ్యవస్థకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తోందని నిరసించారని తెలిపారు. తనకు సంపూర్ణ మద్దతుగా నిలిచిన మల్లికార్జున ఖర్గేకు రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం ఎన్ని ఆటంకాలు సృష్టించినా రాష్ట్ర ప్రగతి కోసం తమ ప్రభుత్వం వెనకడుగు వేయదని సీఎం స్పష్టం చేశారు.

అనుమతుల నిరాకరణ మధ్య జరిగినప్పటికీ తన లండన్ పర్యటన అత్యంత విజయవంతమైందని సీఎం హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా విద్య, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాలు మరియు ప్రపంచ ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాలతో తెలంగాణకు కీలకమైన భాగస్వామ్య ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు. ఈ ఒప్పందాల వల్ల రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు మెరుగవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

లండన్ పర్యటనను ముగించుకుని మరికొద్ది గంటల్లోనే తాను భాగ్యనగరానికి చేరుకుంటానని రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ వైఖరి, పర్యటనలకు అనుమతుల నిరాకరణ వెనుక ఉన్న రాజకీయ కుట్రలు మరియు పర్యటన ఫలితాలకు సంబంధించిన పూర్తి వివరాలను బహిరంగంగా, సవివరంగా మీడియా ముందు వెల్లడిస్తానని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. విదేశీ పర్యటనల అనుమతి విషయంలో కేంద్రం వర్సెస్ తెలంగాణ ప్రభుత్వం మధ్య ఉన్న విభేదాలు ఈ ఘటనతో మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి.

# తెలంగాణ కాంగ్రెస్‌లో కోల్డ్ వార్ హీట్..

### కొండా ఎపిసోడ్‌లోకి ఓబీసీ సంఘం ఎంట్రీ.. రాహుల్ ఇంటిని ముట్టడిస్తామని వార్నింగ్




హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య కొనసాగుతున్న సీక్రెట్ కోల్డ్ వార్ ఒక్కసారిగా రోడ్డున పడింది. ముఖ్యంగా మంత్రి కొండా సురేఖ కుటుంబం చుట్టూ తిరుగుతున్న రాజకీయ పరిణామాలు రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఇటీవల పరకాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ కేటాయింపు, సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేయడంతో ఈ వివాదం పతాక స్థాయికి చేరింది. సుష్మిత నేరుగా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన వర్గంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడం, దానికి ప్రతిస్పందనగా టిపిసిసి క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గాంధీ భవన్ వేదికగా ఉద్రిక్తతకు దారితీసింది.

తాజాగా ఈ ఎపిసోడ్‌లోకి బీసీ

2

# పాత నేతలకే 80% పదవులు..

# కొత్త వారికి 20 శాతం

### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ప్రకటన




హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (భ్రాజజ) అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నేతలు మరియు కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ పదాధికారులు, నిబద్ధత కలిగిన నాయకులు మరియు కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ, వచ్చే సెప్టెంబర్ నెలలోనే రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

పదవుల పంపిణీ నిష్పత్తి ఒ ప్రాధాన్యతలు

పార్టీ కోసం కష్టకాలంలో అహర్నిశలు శ్రమించిన పాత కార్యకర్తలు, నాయకులకు రాబోయే నామినేటెడ్ పదవుల్లో సింహభాగం కేటాయిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు వెల్లడించారు. మొత్తం భర్తీ చేయబోయే నామినేటెడ్ పదవుల్లో 80 శాతం పాత నేతలకే కేటాయిస్తామని, అలాగే పార్టీ బలోపేతానికి మరియు భవిష్యత్తు రాజకీయ అవసరాలకు కొత్త రక్తం అవసరం కాబట్టి ఇటీవల చేరిన కొత్త వారికి 20 శాతం పదవులు ఇస్తామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కార్యకర్తల త్యాగాలు, వారి శ్రమే ముఖ్య కారణమని, అటువంటి కార్యకర్తల కష్టాన్ని పార్టీ అధిష్టానం ఎన్నటికీ మరచిపోదని హామీ ఇచ్చారు.

గతంలో జరిగిన పొరపాట్లపై స్వయం విమర్శ

పదవుల కేటాయింపు ప్రక్రియలో గతంలో కొన్ని చిన్నపాటి పొరపాట్లు లేదా తప్పిదాలు జరిగిన మాట వాస్తవమేనని మహేష్ కుమార్ గౌడ్ బహిరంగంగా అంగీకరించారు. అయితే, ఈసారి చేపట్టే భర్తీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఇకపై పదవుల ఎంపికలో కేవలం క్రమశిక్షణ, నిబద్ధత, పార్టీ పట్ల కష్టపడే తత్వాన్నే ప్రధాన ప్రామాణికంగా తీసుకుంటామని తేల్చిచెప్పారు. ఎన్ఎస్‌యుఐ (చీూఖ×), యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన క్షేత్రస్థాయి శ్రేణులకు కూడా తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

కార్యకర్తల త్యాగాలు ఒ భవిష్యత్తు రాజకీయ లక్ష్యాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను గ్రామస్థాయి వరకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 100కు పైగా స్థానాలను గెలుచుకుని, మళ్లీ ఘనంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాధురి రాథోడ్‌కు అందుకే దగ్గరయ్యే..

# స్ట్రెస్ తగ్గడం కోసమే అలా హోటల్ గదిలో..

### ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ బ్యూరో

తెలుగు జానపద కళారంగంలో ‘బాసింగ బలాలు’ వంటి సూపర్ హిట్ పాటలతో ఎంతో ప్రజాదరణ పొందిన ప్రముఖ ఫోక్ డ్యాన్సర్, నటుడు ఈశ్వర్ సాయి ఇటీవల చెలరేగిన వివాదంపై చివరకు నోరు విప్పారు. వేములవాడలోని ఒక భవనంలో తోటి ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్‌తో కలిసి ఒకే గదిలో ఉన్న సమయంలో ఆయన భార్య శరణ్య వారిని ప్రత్యక్షంగా పట్టుకోవడంతో పెద్ద ఎత్తున రచ్చ జరిగిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూతో పాటు ఇన్స్టాగ్రామ్ ద్వారా ఈశ్వర్ సాయి స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

అసలు ఏం జరిగింది? ఈశ్వర్ సాయి వివరణ

హోటల్ గదిలో మాధురి రాథోడ్‌తో పట్టుబడటంపై స్పందించిన ఈశ్వర్ సాయి, తాను చేసిన పని తప్పేనని బహిరంగంగా అంగీకరించారు. “ఒక భార్య ఉండగా వేరే మహిళతో అలా గదిలో ఉండటం ముమ్మాటికీ నా పొరపాటే. నేను చేసింది తప్పని ఒప్పుకుంటున్నాను. అయితే ఆ సమయంలో నా జీవితంలో తీవ్రమైన మానసిక ఒత్తిడి (స్ట్రెస్) నెలకొంది. కుటుంబ బాధ్యతలు, బిజినెస్ ప్రెజర్, భార్యతో వచ్చిన కొన్ని విభేదాల వల్ల నేను తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నాను. ఆ ఒత్తిడి, ప్రెజర్ నుంచి ఉపశమనం పొందేందుకే, స్ట్రెస్ తగ్గించుకోవడానికే మాధురికి దగ్గరవ్వాల్సి వచ్చింది” అని ఈశ్వర్ సాయి వివరణ ఇచ్చారు.

గత రెండున్నర నెలల క్రితం ఒక పాట చిత్రీకరణ సమయంలోనే తమ మధ్య బంధం బలపడిందని ఆయన చెప్పారు. “ఆ సమయానికి నాకున్న ఒత్తిళ్లకు మాధురి చూపిన ఆత్మీయత, కేరింగ్ నాకు ఎంతగానో నచ్చాయి. దాంతో ఆమెకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను. మాధురి చాలా మంచి వ్యక్తి. ఆమెది మంచి మనసు. ఇందులో మాధురి తప్పు ఏమీ లేదు. నా పరిస్థితిని బట్టి ఆమె నాకు కేరింగ్ చూపించింది, అంతే” అని వ్యాఖ్యానించారు.

గతంలో ఎవరితోనూ బంధం లేదు

ఈ ఘటన ఆధారంగా తన వ్యక్తిత్వాన్ని తప్పుగా చిత్రించవద్దని ఈశ్వర్ సాయి విజ్ఞప్తి చేశారు. “నేను ఇప్పటివరకు దాదాపు వందకు పైగా జానపద పాటల్లో నటించాను. సాధారణంగా పాటల షూటింగ్‌లు పూర్తయ్యాక పార్టీలు జరగడం కామన్, కానీ నేను జీవితంలో ఎప్పుడూ మద్యం తాకింది లేదు. నేను మద్యం తాగినట్లు ఎవరైనా నిరూపిస్తే రూ. 10 లక్షల పారితోషికం ఇస్తాను. నా సినీ, ఫోక్ ప్రయాణంలో మాధురి విషయం మినహా ఇప్పటి వరకు ఏ ఇతర అమ్మాయితోనూ నాకు ఎటువంటి అక్రమ సంబంధాలు లేవు” అని సవాల్ విసిరారు.

గత నాలుగు ఐదేళ్లుగా మాధురి రాథోడ్ తనకు వృత్తిపరంగా తెలుసని, కేవలం “మీరు, గారు” అని గౌరవంతో పిలుచుకునే వాళ్లమని, కానీ ఇటీవలి కాలంలోనే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని స్పష్టం చేశారు.

ఫోక్ ఇండస్ట్రీపై మచ్చ తేకండి

2

తెలంగాణ వెన్నెల వాక్కు TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# మనసు ప్రశాంతంగా ఉంటేనే జీవితం సంపూర్ణం..

## ఆ ప్రశాంతత కోసం మనిషి ఏం కోల్పోతున్నాడు?

మనిషి జీవితంలో సంతోషం కోసం ఎన్నో వెతుకులాటలు. డబ్బు ఉంటే సంతోషంగా ఉంటాననుకుంటాడు.. మంచి ఉద్యోగం వస్తే ప్రశాంతంగా ఉంటాననుకుంటాడు.. సొంత ఇల్లు ఉంటే జీవితం పూర్తవుతుందని భావిస్తాడు. ఒక కోరిక తీరగానే మరో కోరిక మొదలవుతుంది. ఇలా జీవితమంతా ఏదో ఒకటి సాధించాలనే పరుగులో గడిచిపోతుంది. చివరికి వెనక్కి తిరిగి చూసుకుంటే.. సాధించినవి ఎన్నో ఉన్నా, ప్రశాంతంగా గడిపిన క్షణాలు మాత్రం చాలా తక్కువగా కనిపిస్తాయి.

ఇది నేటి మనిషి ఎదుర్కొంటున్న అసలు సమస్య. సౌకర్యాలు పెరిగాయి.. కానీ సంతృప్తి తగ్గింది. మనుషులతో మాట్లాడే మార్గాలు పెరిగాయి.. కానీ ఆత్మీయత తగ్గింది. సమాచారం పెరిగింది.. కానీ మనసుకు విశ్రాంతి తగ్గింది. ప్రపంచం మన చేతిలోకి వచ్చింది.. కానీ మనల్ని మనం అర్థం చేసుకునే సమయం మాత్రం దూరమైంది.

అందుకే ఆధ్యాత్మికతకు నేటి జీవితంలో మరింత ప్రాధాన్యత ఏర్పడుతోంది. ఆధ్యాత్మికత అంటే అన్నింటినీ వదిలేసి ఏకాంతంగా జీవించడం కాదు. మనం ఉన్న జీవితంలోనే మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోకుండా, విజయాలు వచ్చినప్పుడు అహంకారపడకుండా ఉండే సమతుల్యతను సాధించడం. మనకు లేనివాటి గురించి నిరంతరం ఆలోచించడం కంటే.. మనకు ఉన్నవాటిని గుర్తించి కృతజ్ఞతతో జీవించడం.

మనిషి ప్రశాంతతను బయట వెతుకుతున్నాడు. కొత్త వస్తువుల్లో, కొత్త ప్రదేశాల్లో, కొత్త పరిచయాల్లో, కొత్త విజయాల్లో ఆనందాన్ని వెతుకుతున్నాడు. కానీ మనసులో అసంతృప్తి అలాగే ఉంటే ఇవేవీ శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవు.

అందుకే పెద్దలు ముందుగా మనసును గెలుచుకోవాలని చెప్పారు. మనసు ప్రశాంతంగా ఉంటే చిన్న ఇల్లు కూడా సంతోషంగా అనిపిస్తుంది. మనసు అశాంతిగా ఉంటే పెద్ద భవంతి కూడా ఒంటరితనంగానే అనిపిస్తుంది.

ఆధ్యాత్మికత మనిషికి మరో ముఖ్యమైన విషయాన్ని నేర్పుతుంది. ప్రతి విషయం మనకు అనుకూలంగా జరగాల్సిన అవసరం లేదు. కొన్ని కోరికలు నెరవేరకపోవచ్చు. కొన్ని సంబంధాలు దూరమవచ్చు. కొన్ని అవకాశాలు చేజారిపోవచ్చు. కానీ ప్రతి నష్టాన్ని జీవితాంతం మోస్తూ వెళ్లాల్సిన అవసరం లేదు. జరిగినదాన్ని అంగీకరించి, దాని నుంచి పాఠం నేర్చుకుని ముందుకు సాగగలగడం కూడా ఒక గొప్ప ఆధ్యాత్మిక బలం. మనశ్శాంతిని దూరం చేస్తున్న మరో కారణం ఇతరులతో పోల్చుకోవడం. ఎవరి దగ్గర ఏముంది అని చూస్తూ మన దగ్గర ఉన్నదాన్ని తక్కువగా భావించడం మొదలుపెడితే సంతోషం ఎప్పటికీ దొరకదు. ప్రతి మనిషి ప్రయాణం వేరు. అందుకే ఎదుటివారితో కాకుండా నిన్నటి మనతో ఈరోజు మనల్ని పోల్చుకోవడం మంచిది. నిన్నటి కంటే ఈరోజు మనం కొంచెం మంచిగా మారితే అదే నిజమైన పురోగతి.

దేవుడిని ప్రార్థించడం, ఆలయాలకు వెళ్లడం భక్తిలో భాగమే. కానీ ఆ భక్తి మన ప్రవర్తనలో కనిపించాలి. కోపం తగ్గాలి.. మాటలో ప్రేమ పెరగాలి.. ఇతరుల బాధను అర్థం చేసుకునే మనసు రావాలి.. తప్పు చేసినప్పుడు ఒప్పుకునే ధైర్యం ఉండాలి. దేవుడి ముందు తల వంచడం ఎంత ముఖ్యమో.. మన అహంకారాన్ని తగ్గించుకోవడం కూడా అంతే ముఖ్యం. చివరికి మనిషి జీవితాన్ని గొప్పగా చేసేది అతని సంపద కాదు.. అతని మనసు. ఎంత సంపాదించామన్నది ఒకరోజు మిగలకపోవచ్చు. కానీ ఎంతమందికి ఉపయోగపడ్డామన్న జ్ఞాపకం మాత్రం నిలిచిపోతుంది. మన వల్ల ఒకరి ముఖంలో చిరునవ్వు వచ్చినా, కష్టంలో ఉన్నవారికి అండగా నిలిచినా.. అదే మన జీవితానికి నిజమైన అర్థం.

ప్రశాంతత కోసం ప్రపంచాన్ని మార్చాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు మన ఆలోచనలను మార్చుకుంటే చాలు. మనిషి వెతుకుతున్న నిజమైన ఆనందం బయట ఎక్కడో లేదు.. తనలోనే ఉంది. దాన్ని గుర్తించగలిగిన రోజే జీవితం మరింత అర్థవంతమవుతుంది.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# తెలంగాణ కాంగ్రెస్‌లో కోల్డ్ వార్ హీట్..

(ఓబీసీ) హక్కుల సంఘాలు నేరుగా జోక్యం చేసుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్ వర్గపోరు కొత్త మలుపు తిరిగింది.

వివాదం ఎక్కడ ప్రారంభమైంది?

పరకాల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి, రాబోయే ఎన్నికల్లోనూ రేవురి ప్రకాష్ రెడ్డే కాంగ్రెస్ అభ్యర్థి అని సంకేతాలివ్వడం కొండా వర్గాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. తమ కుటుంబానికి పట్టున్న పరకాల నుంచి తన కుమార్తె కొండా సుష్మిత పోటీ పడుతుందని భావిస్తున్న కొండా సురేఖ దంపతులకు ఇది నచ్చలేదు. దీనిపై సుష్మిత తీవ్రస్థాయిలో స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను సవాల్ చేశారు. సీఎం వర్గం, పార్టీలోని కొందరు ముఖ్య నేతలు ఉద్దేశపూర్వకంగా తమ కుటుంబాన్ని రాజకీయంగా అణచివేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

ఈ వ్యాఖ్యల విజువల్స్, కథనాలు మీడియాలో రావడంతో పీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి.. మంత్రి కొండా సురేఖకు లేఖ రాస్తూ వివరణ కోరారు. అయితే తమ కుటుంబానికే అన్యాయం జరుగుతుంటే తమపైనే చర్యలు తీసుకోవడం ఏంటని కొండా వర్గీయులు మండిపడుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. సీఎం విదేశీ పర్యటన నుంచి రాగానే ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తారని చెబుతున్నప్పటికీ, రగడ మాత్రం చల్లారడం లేదు.

రంగంలోకి ఓబీసీ సంఘాలు – తీవ్ర అభ్యంతరం

ఈ క్రమంలో కొండా సురేఖ ఎపిసోడ్‌లోకి ఓబీసీ సంఘాలు ప్రవేశించి విలేకరుల సమావేశాలు, నిరసనలతో కాంగ్రెస్ నాయకత్వంపై విరుచుకుపడ్డాయి. తెలంగాణలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, ప్రజాదరణ కలిగిన బిసి మహిళా నాయకురాలు కొండా సురేఖను పార్టీలో ఒంటరిని చేసేందుకు అగ్రవర్ణ నేతలు కుట్ర పన్నుతున్నారని ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్ ఆరోపించారు.

ఒకే పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, అగ్రవర్ణ నేతలు బహిరంగంగానే పార్టీ నియమావళిని అతిక్రమించినా నోటీసులు ఇవ్వని క్రమశిక్షణా కమిటీ, ఒక బీసీ మంత్రికి మాత్రం వెంటనే నోటీసులు ఇవ్వడం వెనుక ఉన్న పక్షపాత వైఖరిని వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వంటి నేతలపై చర్యలు తీసుకోని పీసీసీకి, బీసీ నేతలపై మాత్రమే ప్రతాపం చూపే ధైర్యం ఉందా? అని ప్రత్యక్షంగా సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ నేతలను కేవలం ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటూ, అధికార పీఠాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తోందని ఓబీసీ నేతలు ధ్వజమెత్తారు.

ఢిల్లీ యాత్ర ఉ రాహుల్ గాంధీ ఇంటి ముట్టడి హెచ్చరిక

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ "కులాంతర జనాభా గణన" (ఝుర్వ జవఅంబం), "జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజకీయ వాటా" అంటూ గళమెత్తుతున్నారని, కానీ తెలంగాణలో మాత్రం ఆయన మాటలకు పూర్తి విరుద్ధంగా బీసీ నాయకత్వాన్ని అణచివేస్తున్నారని బీసీ సంఘాల నేతలు మండిపడ్డారు. కొండా సురేఖపై జరుగుతున్న కుట్రలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఒకవేళ స్థానిక పీసీసీ నాయకత్వం తమ పద్ధతి మార్చుకోకుండా కొండా సురేఖకు లేదా ఆమె కుటుంబానికి రాజకీయంగా అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. తమ నిరసన గళాన్ని హైదరాబాద్ నుంచి ఢిల్లీ వీధులకు తీసుకెళ్తామని హెచ్చరించారు. బీసీ, విద్యార్థి సంఘాల మద్దతుతో ఢిల్లీకి తరలివెళ్లి స్వయంగా రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని ఘాటు వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణలోని బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో భారీ మూల్యం తప్పదని స్పష్టం చేశారు.

హైకమాండ్ తీరుపైనే అందరి దృష్టి

ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన తర్వాత ఈ వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అయితే, కేవలం ఒక నియోజకవర్గానికి లేదా ఒక కుటుంబానికి సంబంధించిన అంతర్గత వ్యవహారంగా ప్రారంభమైన ఈ వివాదం, ఓబీసీ సంఘాల ఎంట్రీతో సామాజిక సమీకరణాల పోరుగా మారి కాంగ్రెస్ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా పరిణమించింది. మరి ఈ కోల్డ్ వార్ తీవ్రరూపం దాల్చకుండా పీసీసీ, హైకమాండ్ ఎలా సర్దుబాటు చేస్తాయో వేచి చూడాలి

# పన్నుల సొమ్ముతో పాలకుల పండుగ!

భారతదేశపు ప్రతిష్టాత్మక గణతంత్ర రాజ్యం యొక్క బలం దానిని పరిపాలించే ప్రజాప్రతినిధుల వ్యక్తిత్వం, బాధ్యతపై ఆధారపడి ఉంటుందని అరిస్టాటిల్ నాడే స్పష్టం చేశారు. పాలకులకు ఇచ్చే అపరిమిత అధికారం పరిమితులు దాటే ప్రమాదముందని మాంటెస్క్యూ హెచ్చరించగా, ప్రజాప్రతినిధులు ఓటర్లకు కేవలం సేవ మాత్రమే కాక తమ విచక్షణను కూడా రుణపడి ఉంటారని ఎడ్మండ్ బర్క్ గుర్తుచేశారు. కానీ, రెండున్నర శతాబ్దాల తర్వాత నేడు భారతీయ ప్రజాస్వామ్యం ఒక తీవ్రమైన వైరుధ్యాన్ని ఎదుర్కొంటోంది: తమ పేరిట అధికారాన్ని చెలాయించే పాలకుల విలాసాల కోసం సామాన్య ప్రజలు ఎంతకాలం తమ రక్తాన్ని ధారపోయాలి? ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశం పౌరుల హక్కులను కాపాడటమేనని జాన్ లాక్ విశ్వసించారు. అయితే, నేడు భారతీయ ప్రజాస్వామ్యం ఒక కార్పొరేట్ సంస్థలా రూపాంతరం చెంది, పరిపాలకులకు హోదాలు, భారీ జీతాలు, భత్యాలు, ఉచిత వాహనాలు, ఆడంబర బంగళాలు మరియు అపరిమిత హక్కుల శ్రేణిని కల్పించే వ్యవస్థగా దిగజారింది. ప్రజాసేవ అనేది ఒక పవిత్రమైన బాధ్యత అనే భావన పోయి, అదొక లాభదాయకమైన ఉద్యోగంగా, సర్వ హక్కులు అనుభవించే ఒక అధికార పీఠంగా మారిపోవడం తీవ్రంగా ఆలోచించాల్సిన అంశం.




ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్రంలోని 234 మంది ఎమ్మెల్యేలకు ప్రభుత్వ వాహనాలు, నెలకు ఇంధనం, నిర్వహణ, డ్రైవర్ ఖర్చుల కోసం ?75,000, అసిస్టెంట్ కోసం మరో ?25,000 ఇస్తామని ప్రకటించారు. నియోజకవర్గాల్లో మెరుగైన సేవలు అందించడానికే ఈ నిర్ణయమని పైకి చెబుతున్నప్పటికీ, దీనివల్ల ఐదేళ్ల కాలంలో ప్రజా ఖజానాపై ?200 కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది. ఇది ప్రజాప్రతినిధుల పాలన యొక్క అసలు వ్యయంపై మరియు రాజకీయం ఒక పక్కా వ్యాపార లావాదేవీలా మారుతోందా అనే దానికి అద్దం పడుతోంది.

శాసనసభ్యులు తమ బాధ్యతలను నెరవేర్చడానికి తగిన వసతులు కల్పించడం సమర్థనీయమే కావచ్చు. ఒక ఎమ్మెల్యే నియోజకవర్గమంతటా పర్యటించాలి, సమావేశాలకు హాజరవ్వాలి, అధికారులను కలవాలి, పథకాలను తనిఖీ చేయాలి. వేలాది ప్రజల సమస్యలను పరిష్కరించాలి. తమిళనాడు సభలో ఉన్న అనేకమంది కొత్త ఎమ్మెల్యేలకు సొంత వనరులు లేకపోవచ్చు. అయితే, నిజమైన ప్రజా సేవకు అందించే సహాయానికి, రాజకీయ విలాసాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజాప్రతినిధులు విస్మరిస్తున్నారు. మొదట్లో సేవ కోసం ఇచ్చే వసతి, కాలక్రమేణా తొలగించలేని ఒక జన్మహక్కుగా మారిపోతోంది. ఒకవైపు సామాన్య పౌరుడు పన్నుల భారాన్ని భరిస్తూ, సబ్సిడీలను కోల్పోతుంటే, మరోవైపు ప్రజాప్రతినిధుల ఖర్చులు అపరిమితంగా పెరిగిపోవడం ప్రజాస్వామ్యానికే అవమానకరం.

ఈ దుస్థితి ఒక్క తమిళనాడుకే పరిమితం కాలేదు. బీహార్‌లో ఎన్నికలకు ముందే ప్రజాప్రతినిధుల కోసం కొత్త అధికారిక నివాసాలు, బంగళాల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వాలు మారినా, రాజకీయ భావజాలాలు మారినా... అధికారంలోకి రాగానే తమకు మెరుగైన ఇళ్లు, ఎక్కువ జీతాలు, విలాసవంతమైన సదుపాయాలు కల్పించుకోవడంలో రాజకీయ వర్గమంతా ఏకమవుతోంది. సిద్ధాంతాలు, పార్టీల సరిహద్దులు పక్కనపెట్టి ప్రజాధనాన్ని పంచుకోవడంలో ఉన్న ఈ ఐక్యత ప్రజా సంక్షేమంలో ఏమాత్రం కనిపించడం లేదు.

ఇక్కడ అసలైన విడ్డూరం ఏమిటంటే--- రాజకీయ వర్గానికి అయ్యే ఖర్చు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, చట్టసభల పనితీరు, చర్చల సమయం మాత్రం ఘోరంగా పడిపోతోంది. శాసనసభలు ఏడాదిలో ఏ కొద్ది రోజులు మాత్రమే సమావేశమవుతున్నాయి. పార్లమెంటు సభలు సైతం వాయిదాలు, నిరసనలు, గందరగోళం మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రజాసమస్యలపై, బడ్జెట్ ఖర్చులపై, కీలక చట్టాలపై లోతైన చర్చలు జరగడానికి తగిన సమయమే కేటాయించడం లేదు. సభలు సక్రమంగా జరగకపోయినా, ప్రజాసమస్యలు పరిష్కారం కాకపోయినా పాలకుల అలవెన్సులు మరియు సౌకర్యాలకు మాత్రం ఎలాంటి ఢోకా ఉండటం లేదు. అనధికారిక అంచనాల ప్రకారం, దేశంలోని 4,200 మందికి పైగా ఎమ్మెల్యేలు మరియు 788 మంది ఎంపీల కోసం ఏటా ?2,000 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చవుతోంది. ఇవి కాకుండా, ప్రతి సభ్యునికి నియోజకవర్గ అభివృద్ధి కోసం ?1 కోటి నుండి ?5 కోట్ల వరకు నిధులు కేటాయిస్తున్నారు. అయితే ఈ భారీ ఖర్చు వల్ల గ్రామాలు లేదా పట్టణాలు ఏమైనా మెరుగ్గా మారాయా అంటే దానికి ఎలాంటి రుజువులూ లేవు. నిధుల వినియోగంలో పారదర్శకత లోపించడం, కేటాయింపులపై సరైన ఆడిటింగ్ లేకపోవడం వల్ల ఈ సొమ్మంతా ఎటు పోతోందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది.

భారతీయ ఓటరు ప్రజాప్రతినిధుల పనితీరుపై అసంతృప్తితో ఎన్నికల్లో ఓడించినప్పటికీ, ఎన్నికల మధ్య ఉండే ఐదేళ్ల కాలంలో ఈ ప్రజాధనాన్ని ప్రజాప్రతినిధులు ఎలా బొక్కేస్తున్నారో నిలదీసే సమర్థవంతమైన వ్యవస్థ పౌరుడి వద్ద లేదు. ప్రజాప్రతినిధులకు తగిన సదుపాయాలు ఇవ్వకూడదని కాదు; కానీ వారు పొందే వసతులకు, చేసే పనితీరుకు మధ్య ఒక బాధ్యతాయుతమైన అనుసంధానం ఉండాలి. జీతాలు, భత్యాలు పెంచినప్పుడు, సభకు క్రమం తప్పకుండా హాజరుకావడం, కమిటీల సమావేశాలలో పాల్గొనడం, చట్టసభల చర్చల్లో చురుగ్గా పాలుపంచుకోవడంపై కఠినమైన నిబంధనలను తప్పనిసరి చేయాలి.

ప్రస్తుతం నాయకులు తమకున్న చట్టసభ అధికారాలను ఉపయోగించుకుంటూ "తక్కువ పని చేస్తూ ఎక్కువ ప్రతిఫలాలు" పొందుతున్నారు. ఒక పరిణతి చెందిన ప్రజాస్వామ్యం ప్రజాప్రతినిధులను ఎంత ఘనంగా పోషిస్తుందనే దాన్ని బట్టి కాకుండా, ప్రజలు ఇచ్చిన సొమ్మును వారు ఎంత బాధ్యతాయుతంగా వాడుతున్నారనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. పౌరుల పన్నుల డబ్బుతో ప్రజాప్రతినిధులు పండుగ చేసుకోవడం ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం. భారతదేశానికి కావలసింది పన్నుల సొమ్ముతో శోకులు చేసే పాలకులను కాదు, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉంటూ, ప్రజాధనానికి రక్షణగా నిలుస్తూ మెరుగైన ఫలితాలు ఇచ్చే పనిమంతులైన నాయకులను!



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559863

# మాధురి రాథోడ్‌కు అందుకే దగ్గరయ్యే.. స్ట్రెస్ తగ్గడం కోసమే అలా హోటల్ గదిలో..



ఈ వివాదం తమ వ్యక్తిగతమైనదని, దీనితో జానపద కళారంగానికి ఎలాంటి సంబంధం లేదని ఈశ్వర్ సాయి ఆవేదన వ్యక్తం చేశారు. "జానపద రంగాన్ని నమ్ముకుని ఎందరో కళాకారులు ఉపాధి పొందుతున్నారు. నాకు అన్నం పెట్టిన ఫోక్ ఇండస్ట్రీలో ఎక్కడా కాస్టింగ్ కౌచ్ లేదు. దయచేసి మా వ్యక్తిగత విషయంలోకి ఫోక్ ఇండస్ట్రీని లాగి, ఆ పరిశ్రమకు చెడ్డపేరు తేకండి" అని కన్నీటిపర్యంతమయ్యారు.

అలాగే, గదిలో తమపై దాడి జరిగినప్పుడు భార్యకంటే ఎక్కువగా పక్కనుండి వీడియోలు తీసి గొడవను పెద్దది చేసిన మూడో వ్యక్తి ప్రవర్తనపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యక్తిగత వ్యవహారంపై మాధురి రాథోడ్‌కు కూడా తాను బహిరంగంగా క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు. కాగా, ప్రస్తుతం ఈ వివాదం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతుండగా, నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

అసలు ఏం జరిగింది? ఈశ్వర్ సాయి వివరణ

హోటల్ గదిలో మాధురి రాథోడ్‌తో పట్టుబడటంపై స్పందించిన ఈశ్వర్ సాయి, తాను చేసిన పని తప్పేనని బహిరంగంగా అంగీకరించారు. "ఒక భార్య ఉండగా వేరే మహిళతో అలా గదిలో ఉండటం ముమ్మాటికీ నా పొరపాటే. నేను చేసింది తప్పని ఒప్పుకుంటున్నాను. అయితే ఆ సమయంలో నా జీవితంలో తీవ్రమైన మానసిక ఒత్తిడి (స్ట్రెస్) నెలకొంది. కుటుంబ బాధ్యతలు, బిజినెస్ ప్రెజర్, భార్యతో వచ్చిన కొన్ని విభేదాల వల్ల నేను తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నాను. ఆ ఒత్తిడి, ప్రెజర్ నుంచి ఉపశమనం పొందేందుకే, స్ట్రెస్ తగ్గించుకోవడానికే మాధురికి దగ్గరవ్వాల్సి వచ్చింది" అని ఈశ్వర్ సాయి వివరణ ఇచ్చారు.

గత రెండున్నర నెలల క్రితం ఒక పాట చిత్రీకరణ సమయంలోనే తమ మధ్య బంధం బలపడిందని ఆయన చెప్పారు. "ఆ సమయానికి నాకున్న ఒత్తిళ్లకు మాధురి చూపిన ఆత్మీయత, కేరింగ్ నాకు ఎంతగానో నచ్చాయి. దాంతో ఆమెకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను. మాధురి చాలా మంచి వ్యక్తి. ఆమెది మంచి మనసు. ఇందులో మాధురి తప్పు ఏమీ లేదు. నా పరిస్థితిని బట్టి ఆమె నాకు కేరింగ్ చూపించింది, అంతే" అని వ్యాఖ్యానించారు.

## నేడు ముధోల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి



ముధోల్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లవకుమార్ తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి సమస్యలపై వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. మండల పరిధిలోని ఇరవై మూడు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బాసర క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

## సరస్వతి ఆలయంలో కిటకిటలాడిన క్యూలైన్లు



బాసర, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధికి శ్రావణ మాస వారాంతపు సెలవు దినం కావడంతో భక్తులు పోటెత్తారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి.

గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అమ్మవారి మూలవిరాట్ దర్శనానికి భారీగా తరలివచ్చారు. చిన్నారుల అక్షరాభ్యాస పూజల కోసం వచ్చిన భక్తులతో అక్షర మందిరం, బాలాలయం కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనీ దేవి ఆలయ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ సిబ్బందికి మార్గదర్శకాలు అందించారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. ప్రముఖ నాయకురాలు రమాదేవి అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రసాదాలు అందజేశారు.

## మామడ రైస్‌మిల్‌పై వచ్చిన ఆరోపణలు అవాస్తవం

మామడ, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): మామడ మండలంలోని రైస్‌మిల్‌కు సంబంధించి ఇటీవల వచ్చిన కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. మిల్ ఉన్న భూమికి రెవెన్యూ శాఖ జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్ ఉందని, అటవీ శాఖ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపింది. పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. తమ వివరణను పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించిందని వెల్లడించింది. తుది నిర్ణయం వెలువడే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు స్పష్టం చేసిందని, ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరింది.

## జేఏసీ మండల యువజన కన్వీనర్‌గా సందీప్ ఎన్నిక



లక్ష్మణచాంద, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): లక్ష్మణచాంద మండల బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ యువజన సంఘం కన్వీనర్‌గా సందీప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధికార ప్రతినిధి ముద్రబోయిన వినేష్, మండల అధ్యక్షుడు సుంకరి సురేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, నాయకులు రామగిరి రవీందర్, కల్లూరు సుధాకర్ సమక్షంలో ఈ నియామకం చేపట్టారు. యువతను చైతన్యవంతం చేస్తూ సామాజిక హక్కుల సాధనకు నిరంతరం కృషి చేయాలని నూతన కన్వీనర్‌కు సూచించారు.

## ఉమ్రిలో ఘనంగా అన్నభావు సాఠే జయంతి



తానూరు, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూరు మండలంలోని ఉమ్రి గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్నభావు సాఠే నూట ఆరవ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం అన్నభావు సాఠే చేసిన రచనలు, పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆనందరావు పటేల్, సాగర్ బాయి రాజన్న, పోతరెడ్డి, ఉత్తం భలేరావు, దర్శకుడు కొత్తూరు శంకర్ పాల్గొన్నారు.

## కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



దిలావర్‌పూర్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కదిలి శ్రీ పాపహరేశ్వర స్వామి దేవాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ వెంకట్రావు పటేల్ అదనపు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. పూజారులు ఆలయ చరిత్ర విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో కదిలి సర్పంచ్ మారుతి పటేల్, సంబాజీ పటేల్, మాధవరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భామినిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



తానూరు, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూరు మండలం భామిని గ్రామంలో లబ్ధిదారుడు భూమేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి లబ్ధిదారుడికి శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, తుమ్మోళ్ల దత్తు, రాజన్న, ఉత్తం భలేరావు, పోతారెడ్డి, ఉపసర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

## ఆంజనేయ ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

బాసర, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండల కేంద్రంలోని రేణుకాపూర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామ ప్రముఖుడు జ్ఞాని పటేల్ లక్ష రూపాయల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయంగా నగదును కమిటీ ప్రతినిధులకు అందజేశారు. దాత సేవా గుణాన్ని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ పలు దేవాలయాల అభివృద్ధి పనులకు సహకారం అందించి గ్రామానికి ఆదర్శంగా నిలిచారని గ్రామ పెద్దలు ప్రశంసించారు.



## అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



నిర్మల్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలో జరిగిన అయ్యప్ప సేవా సమితి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి అధ్యక్షుడిగా బద్రి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా జాప ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాధం ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా కనపర్తి విఘ్నేష్, కోశాధికారిగా కుంటాల సాయినాథ్ బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గాన్ని ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నంది అవార్డు గ్రహీత పీఎన్ మూర్తి గురుస్వామిని సేవా సమితి సభ్యులు ప్రత్యేకంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు.

## కష్టకాలంలో తోటి మిత్రురాలికి పూర్వ విద్యార్థుల ఆపన్న హస్తం

నర్సాపూర్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): నర్సాపూర్ పాఠశాలకు చెందిన 2004-05 పదో తరగతి పూర్వ విద్యార్థులు తోటి స్నేహితురాలికి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనుకోని ఆపదతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న తమ క్లాస్‌మేట్ గంగసాగర కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మిత్రులు తక్షణమే స్పందించారు. అందరూ కలిసి యాభై ఆరు వేల రూపాయల సహాయ నిధిని సేకరించి నేరుగా ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. పాఠశాల రోజులు ముగిసి ఇరవై ఏళ్లు గడిచినా స్నేహబంధం చెక్కుచెదరలేదని, తోటి వారికి అండగా నిలవడం తమ బాధ్యతని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఆపదలో ఆదుకున్న పూర్వ విద్యార్థుల సేవా గుణాన్ని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# రోస్టర్ పాయింట్ సవరించకపోతే మాలలకు తీవ్ర అన్యాయం: డాక్టర్ గోపీనాథ్

## నిర్మల్ టీఎన్జీవో భవన్‌లో మాల కోఆర్డినేషన్ ఫోరం సదస్సు




నిర్మల్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా నాయకుడు మురళి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా చేపట్టిన వర్గీకరణ వల్ల విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలకు తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్ ఇరవై రెండు కేటాయించడం వల్ల భవిష్యత్తులో నిరుద్యోగులకు అవకాశాలు దక్కవని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర నాయకుడు పి. శంకర్ మాట్లాడుతూ వర్గీకరణ అంశంలో సామాజిక న్యాయం దక్కలేదని, హక్కుల సాధనకు సమాజం మేల్కోవాలని కోరారు. మహిళా నాయకురాలు శకుంతల, తిరుపతయ్య మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణలో మహిళల భాగస్వామ్యం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఇటీవల మరణించిన పూర్వ అధికారి బాలచందర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రంజిత్, డాక్టర్ సురేష్, డాక్టర్ రమేష్, దామెర రాములు, ముత్యం, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకే గ్రామాల్లో కార్డాన్ సెర్చ్

## వెంగ్వపేటలో ఎనభై ఐదు వాహనాలు సీజ్ చేసిన పోలీసులు




నిర్మల్ రూరల్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా నిర్మల్ రూరల్ మండలం వెంగ్వపేట గ్రామంలో పోలీసులు తెల్లవారుజామున ఆకస్మిక కార్డాన్ సెర్చ్ తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో సర్కిల్ అధికారులు, సిబ్బంది గ్రామంలోని ఇళ్లు, వీధుల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు.

తనిఖీల్లో సరైన పత్రాలు లేని ఎనభై మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో రిక్షా, ఒక టాటా మ్యాజిక్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, అనుమానాస్పద నేరస్థులు ఆశ్రయం పొందితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

యువత మద్యం, గంజాయి, మత్తు పదార్థాల వంటి చెడు అలవాట్లకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీఎస్పీ హితవు పలికారు. ఎవరైనా మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా సమస్యలు ఎదురైతే డయల్ 112 నంబర్‌కు సంప్రదించాలని గ్రామస్తులకు సూచించారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. కాలనీల్లో రక్షణ కోసం ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణ, ఎస్సైలు శ్రీకాంత్, లింబాద్రి, గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవేందర్ రెడ్డి ఆసుపత్రిలో గుండె వైద్య సేవలు ప్రారంభం

## స్థానికంగానే అత్యాధునిక అత్యవసర చికిత్సలు అందుబాటులోకి



నిర్మల్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని డాక్టర్ దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సరికొత్తగా కార్డియాలజీ విభాగాన్ని ప్రారంభించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జగన్నాథం నేటి నుంచి ఆసుపత్రిలో ఓపీ సేవలను అధికారికంగా ప్రారంభించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ దేవేందర్ రెడ్డి ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత తీవ్ర సమస్యలతో బాధపడే రోగులు అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పుతాయన్నారు. స్థానికంగానే సరైన సమయంలో అత్యుత్తమ వైద్యం అందించడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు.

ఆసుపత్రిలో ఇరవై నాలుగు గంటల పాటు నిరంతరాయంగా అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, వైద్య పరికరాల సహాయంతో రోగులకు అత్యున్నత ప్రమాణాలతో చికిత్స అందిస్తామని తెలిపారు.

నిర్మల్ జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ గుండె వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులకు మెరుగైన సేవలందించడమే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణులకు ఉచితంగా జీర్ణవ్యవస్థ క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు

## కుంజర యాత్ర ద్వారా డాక్టర్ విమలాకర్ రెడ్డి విశేష సేవలు



లక్ష్మణచాంద, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా వడ్యాల్ గ్రామానికి చెందిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ విమలాకర్ రెడ్డి తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కుంజర యాత్ర ద్వారా గ్రామీణ పేద ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తున్నారు. గత రెండేళ్ల కాలంలో ఇరవై మూడు జిల్లాల పరిధిలో యాభై ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఆరు కోట్ల రూపాయల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. ఇప్పటివరకు పన్నెండు వేల ఐదు వందల ఇరవై నాలుగు మందికి ప్రాథమిక స్క్రీనింగ్ నిర్వహించి, మొత్తం అరవై ఆరు వేల మూడు వందల ఇరవై ఒక్క వైద్య పరీక్షలు పూర్తి చేశారు. రక్త పరీక్షలు, లివర్ ఫంక్షన్, లిపిడ్ ప్రొఫైల్, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎండోస్కోపీ, ఫైబ్రోస్కాన్ తదితర అత్యాధునిక పరీక్షలను పేదలకు ఉచితంగా నిర్వహించారు.

పరీక్షల్లో భాగంగా రెండు వందల ఏడు మందిలో క్యాన్సర్ అనుమానిత లక్షణాలను ప్రాథమికంగా గుర్తించి, తదుపరి వైద్య చికిత్సల కోసం రిఫర్ చేశారు. మరో పది వేల మందికి పైగా ఉన్న సాధారణ ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన మందులు, వైద్య సలహాలు అందించారు. ఆర్థిక ఇబ్బందులు, అవగాహనా లోపం వల్ల ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదన్నదే తమ ఆశయమని డాక్టర్ విమలాకర్ రెడ్డి పేర్కొన్నారు. వ్యాధులను ముందస్తుగా గుర్తించి ప్రాణాలు కాపాడటమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న వైద్య బృందాన్ని పలువురు అభినందించారు.

# బాలాజీ గుట్టపై ఇరవై ఏళ్ల తర్వాత విద్యుత్ వెలుగులు



తానూరు, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూరు మండలం బోరేగాం గ్రామంలోని బాలాజీ గుట్టపై రెండు దశాబ్దాలుగా నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. గుట్టపై ఉన్న ఆలయానికి విద్యుత్ లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి కేవలం మూడు రోజుల్లోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై భాజపా విస్తృత కార్యశాల



ముధోల్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ప్రాంగణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై రెండో విడత అసెంబ్లీ స్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడటం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ ప్రక్రియలో పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు క్రియాశీలకంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త సంజర్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, రావుల రామ్‌నాథ్, పైడిపల్లి గంగాధర్, దత్తాత్రి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు ముధోల్ శిశుమందిర్ విద్యార్థులు



ముధోల్, ఆగస్టు 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆదిలాబాద్ విభాగం ఆధ్వర్యంలో నిర్మల్ ఆదర్శనగర్ శిశుమందిర్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఫేర్‌లో ముధోల్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విజ్ఞాన శాస్త్రం, గణితం నమూనాలు, క్విజ్, ప్రయోగాల విభాగాల్లో మొదటి స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ నెల ముప్పై నుంచి ముధోల్ పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రధానాచార్యులు సారథి రాజు తెలిపారు. విజేతలను పాఠశాల కమిటీ సభ్యులు, ఆచార్యులు అభినందించారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com